# మూడు గ్రూపులుగా ఎస్సీల వర్గీకరణ

## గ్రూప్-1కు 1%, గ్రూప్-2కు 9%, గ్రూప్-3కు 5% రిజర్వేషన్లు

- రాష్ట్రంలో 59 ఉపకులాల గుర్తింపు
- క్రీమీలేయర్‌కు ప్రభుత్వ తిరస్కరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల్లోని ఉపకులాలన్నింటికీ సమానంగా రిజర్వేషన్లు వర్తింపజేసేందుకు వారిని మూడు గ్రూపులుగా విభజించాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీలలో మొత్తం 59 ఉపకులాలను గుర్తించిన కమిషన్ వాటిని గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని పేర్కొంది. ఏకసభ్య కమిషన్ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. కోర్టు తీర్పు అమలులో భాగంగానే జస్టిస్ డాక్టర్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నియమించామని తెలిపారు. ఈ కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదికను రూపొందించిందని చెప్పారు. ఎస్సీలకు రాజ్యాంగం ప్రకారం 15 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని, వాటిని 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసిందని తెలిపారు. ఎస్సీలలోని ఉపకులాల జనాభా ప్రాతిపతికను గ్రూపులను విభజించి, ఆయా గ్రూపుల వారీగా రిజర్వేషన్ల శాతాన్ని సిఫారసు చేసిందని వెల్లడించారు. గ్రూప్-1లో 15 ఉపకులాలు (జనాభా 3.288శాతం) ఉండగా వారికి ఒక శాతం, గ్రూప్-2లోని 18 ఉపకులాలు (జనాభా 62.74శాతం) ఉండగా, వారికి 9 శాతం, గ్రూప్-3లో 26 ఉపకులాలు (జనాభా 33.96 శాతం) ఉండగా, వారికి 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సూచించింది. ఎస్సీ కులాలలోని గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. కాగా ప్రభుత్వం తిరస్కరించింది.

### నా జీవితంలో ఈ రోజు చిరస్మరణీయం: సీఎం

ఎస్సీల వర్గీకరణ, కులగణన నేపథ్యంలో ఇది తన జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన రోజు అని, ఇది ప్రత్యేకంగా గుర్తుండి పోతుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం తనకు వచ్చిందని అన్నారు. రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయాయని అన్నారు. ఇప్పటికైనా వర్గీకరణ అమలుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కమిషన్ సమర్పించిన 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక చర్చను పొందుపరిచిందని చెప్పారు. ఎస్సీలకు చెందిన 59 కులాలను మూడు గ్రూపులుగా విభజించాలని కమిషన్ సిఫారసు చేసిందని వెల్లడించారు.

**ఎస్సీ కులాలకు రోస్టర్ పాయింట్లను కమిషన్ ఈ విధంగా సిఫారసు చేసింది**

గ్రూప్ పేరు : ప్రతిపాదిత రోస్టర్ పాయింట్లు
గ్రూప్- 1: 7
గ్రూప్- 2: 2,16,27,47,52,66,72,87,97
గ్రూప్- 3: 22,41,62,77,91

### క్రీమీలేయర్ సిఫారసు తిరస్కరణ

జస్టిస్ షమీమ్ అఖ్తర్ కమిషన్ క్రీమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని సిఫారసు చేసింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, మేయర్లు తదితర ప్రజాప్రతినిధులతోపాటు గ్రూప్-1 సర్వీసుల్లో ఉన్న వారిని, ఉన్నత స్థానాల్లో ఉన్నవారిని క్రీమీలేయర్‌గా పరిగణించాలని సూచించింది. ఈ వ్యక్తుల రెండో తరం వారు రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందకుండా మినహాయించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. కాగా ఈ సిఫారసులను ప్రభుత్వం తిరస్కరించిందని, మిగిలిన సిఫారసులను ఆమోదించింది అని సీఎం పేర్కొన్నారు.

### సోషల్ జస్టిస్ డేగా...

దశాబ్దాల పోరాటానికి శాశ్వత పరిష్కారం చూపినందుకుగాను ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డేగా నిర్వహించుకోవాలని, అందులో అంతా పాల్గొనాలని సీఎం విజ్ఞప్తిచేశారు. ఎస్సీ వర్గీకరణతోపాటు కులగణనకు శాసనసభ ఆమోదం తెలిపిన రోజైన ఫిబ్రవరి 4ను ఇకనుంచి సోషల్ జస్టిస్ డేగా నిర్వహించాలని సీఎం బడుగు, బలహీన, దళిత, సామాజిక వర్గాలకు విజ్ఞప్తి చేశారు.

### గ్రూప్-1 కింద 15 కులాలు

బావురి, బేడా (బుడ్గ) జంగం, చచాటి, డక్కల్- డొక్కల్వార్, జగ్గలి, కొలుపులవాండ్లు-పంబాడ-పంబండ-పంబాలా, మాంగ్, మాంగ్ గరోడి, మన్నే, ముష్తీ, మాతంగి, మెహతర్, ముండాల, సంబన్, సప్రు.

### గ్రూప్-2 కింద 18 కులాలు

అరుంధతీయ, బండ్ల, చమర్- మోచి- ముచి- చమర్-రవిదాస్, చమర్-రోహిదాస్, చంబర్, చండాల, దండాసి, డోమ్- డోంబారా- పైడి- పానో, ఎల్లమ్మల్వార్- ఎల్లమ్మలవాండ్లు, గోడారి, జాంబువులు, మాదిగ, మాదిగదాసు- మష్టీన్, పామిడి, పంచమ- పరియ, సమగర, సిందోళ్లు (చిందోళ్లు), యాటల, వల్లువన్.

### గ్రూప్-3 కింద 26 కులాలు

ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, ఆరె మాల, ఆర్య మాల, బారికి, బ్యాగరి, చలవాడి, డోర్, ఘాసి, హడ్డి, రెల్లి, దాచండి, గోసంగి, హోలేయా,హోలేయ దాసరి, మాదాసి కురువ, మాదరి కురువ, మహర్, మాల, మాల అయ్యవార్, మాల దాసరి, మాలదాసు, మాల హన్నయ్, మాలజంగం, మాల మస్తీ, మాల సాలె, నేతకాని, మాల సన్యాసి, మిత అయ్యల్వార్, పాకి, మోటీ, తోటి, రెల్లి.

### ఉద్యోగాల భర్తీలో ప్రిఫరెన్షియల్ మోడల్....

ఉద్యోగాల భర్తీకి కమిషన్ ప్రిఫరెన్షియల్ మోడల్‌ను ప్రతిపాదించింది. గ్రూప్-1లో నోటిఫై చేయబడిన, భర్తీ చేయని ఖాళీలను తదుపరి ప్రాధాన్యత గ్రూప్ అంటే గ్రూప్- 2 ద్వారా భర్తీ చేయాలి. గ్రూప్-2లో భర్తీ చేయని ఖాళీలను గ్రూప్-3లోని వారి ద్వారా భర్తీ చేయాలి. అన్ని గ్రూపులలో తగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే భర్తీ చేయని ఖాళీలను క్యారీ ఫార్వర్డ్ చేయాలి.

### కమిషన్ సిఫారసుల ఆధారంగా రిజర్వేషన్లు...

| క్యాటగిరీ | కులాల సంఖ్య | జనాభా శాతం | రిజర్వేషన్ శాతం |
|---|---|---|---|
| గ్రూప్ – 1 | 15 | 3.288 | 1 |
| (సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అత్యంత వెనుకబడిన / పట్టించుకోని షెడ్యూల్డ్ కులాలు) | | | |
| గ్రూప్ –2 | 18 | 62.748 | 9 |
| (మధ్యస్థంగా లబ్ధిపొందిన షెడ్యూల్డ్ కులాలు) | | | |
| గ్రూప్ –3 | 26 | 33.963 | 5 |
| (మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూల్డ్ కులాలు ) | | | |
| మొత్తం | 59 | 100 | 15 |



# వర్గీకరణకు మద్దతిచ్చిందే బీఆర్ఎస్

- తెలంగాణలో అవసరమైన చర్యలు చేపట్టింది మేమే
- శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించిన కేసీఆర్
- ఎస్సీ డిక్లరేషన్ అమలు ఎప్పటి నుంచో చెప్పాలి
- ఎస్సీల వర్గీకరణ అంశంపై అసెంబ్లీలో కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాకుండా అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వర్గీకరణ ఉద్యమానికి అడుగడుగునా అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణపై మంగళవారం కేసీఆర్ శాసనసభలో మాట్లాడుతూ.. 'మలిదశ తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి, అంటే 2001నుంచి వర్గీకరణకు స్పష్టంగా మద్దతు ఇస్తున్నది. అస్తిత్వ ఉద్యమానికి నాయకుడిగా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకున్న నాయకుడిగా, కేసీఆర్‌తోపాటు ఆనాడు మరో అస్తిత్వ ఉద్యమానికి నాయకుడిగా ఉన్న కృష్ణమాదిగను, ఉద్యమంలో అసువులు బాసిన అమరులను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. వర్గీకరణ కోసం ఉద్యమించిన ఎంఆర్‌పీఎస్, టీఎంఆర్‌పీఎస్, ప్రజా సంఘాలు, సంస్థలు, వ్యక్తులు చేసిన ప్రతి పోరాటానికి కేసీఆర్ అండగా నిలిచారు' అని కేటీఆర్ చెప్పారు. '2014లో రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రిగా కేసీఆర్ వర్గీకరణకు అవసరమైన చర్యలు చేపట్టారు. అయినా వర్గీకరణను మేము అడ్డుకున్నట్టు చెప్పే ప్రయత్నం కొందరు కాంగ్రెస్ సభ్యులు చేశారు. 2014, నవంబర్ 29 న, అంటే కేసీఆర్ నిరాహారదీక్షకు కూర్చొని సరిగ్గా ఐదేండ్లు గడిచిన సందర్భంగా నిర్వహించిన దీక్షాదివస్‌ను పురస్కరించుకొని శాసనసభలో కేసీఆర్ వర్గీకరణ తీర్మానాన్ని ప్రతిపాదించారు. జనాభా ఆధారంగా అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసైనా వర్గీకరణకు నడుం బిగించాలని తీర్మానం చేశారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలిసి ప్రధానికి నేరుగా తీర్మానం కాపీని అందించిన ఘనత కేసీఆర్‌ది. బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్టుగా సామాజిక స్వేచ్ఛ అనేది లేకపోతే చట్టం ద్వారా సంక్రమించిన ఏ హక్కైనా వ్యర్థం, నిరర్థకం. అంబేద్కర్ చెప్పిన విధంగా బోధించు, సమీకరించు, పోరాడు అనే తత్వాన్ని జీర్ణించుకొని పోరాడిన పార్టీగా బీఆర్ఎస్ పార్టీ వర్గీకరణ ఉద్యమంలో ఉన్న నిజాయితీని అర్థంచేసుకొని ప్రతిపక్షంలో ఉన్నా, అధికారపక్షంలో ఉన్నా మొదటినుంచి మద్దతిచ్చింది. ఎంఆర్‌పీఎస్ పోరాటంలో అమరులైన వారికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వం. వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో పదేండ్లపాటు సీనియర్ మోస్ట్ కౌన్సిల్స్‌ను నియమించి గట్టిగా వాదించాం' అని కేటీఆర్ అన్నారు.

### అభయహస్తం అమలు ఎప్పటి నుంచో చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్టు అంబేద్కర్ అభయహస్త పథకాన్ని ఎప్పుడు అమలుచేస్తారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. 'మీరు అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12లక్షల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. వర్గీకరణ సిఫారసులను అమలుచేయడంతోపాటు అంబేద్కర్ అభయహస్తం పథకానికి కూడా వచ్చే బడ్జెట్‌లో తగిన నిధులు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ఆర్థిక వెనుకబాటుపై కూడా చెప్పారు. ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్‌లో, కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం ఇస్తామని చెప్పారు. కాస్ట్ విత్ క్యాపిటల్ అన్నప్పుడు ఈ వెసులుబాటు కల్పించాలి. ఇది ఎప్పటినుంచి అమలుచేస్తారో చెప్పాలి. సాక్షాత్తు పార్టీ అధ్యక్షుడు ఖర్గే చేతులమీదుగా ప్రవేశపెట్టిన ఈ డిక్లరేషన్ ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి. దళితులు వర్గీకరణను స్వాగతిస్తున్నాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

## లోకం పోకడ




పడిపోయేది రూపాయే కాదు, మన ఇండియన్స్ కూడా!

## ఇంటింటి సర్వే పక్కనబెట్టి ఎస్సీ వర్గీకరణ

మొదటిపేజీ తరువాయి...

ఎస్సీల వర్గీకరణకు మాత్రం ఆ గణాంకాలను పరిగణించకపోవడంపై దళిత సంఘాలు మండిపడుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో సేకరించిన జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించాలన్న ఏకసభ్య కమిషన్ నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై దళిత సంఘాలు నిప్పులు చెరుగుతున్నాయి.

సుప్రీంకోర్టు తీర్పుననుసరించి ఎస్సీలను వర్గీకరించేందుకు తగు సిఫారసులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా క్యాబినెట్ సబ్‌కమిటీని, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలో ఏకసభ్య జ్యూడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఏకసభ్య కమిషన్ క్యాబినెట్ సబ్‌కమిటీకి ఇచ్చిన నివేదికను ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 2011లో ఉమ్మడి రాష్ట్రంలో సేకరించిన జనాభా లెక్కల ప్రకారం ఎస్సీల జనాభా 52,17,684 మందిగా కమిషన్ నిర్ధారించింది. రాష్ట్రంలోని షెడ్యూల్డు కులాల్లో 59 ఉప కులాలను గుర్తించిన కమిషన్ వాటిని మూడు గ్రూపులుగా విభజించింది. ఎస్సీలకు అమలు చేస్తున్న 15 శాతం రిజర్వేషన్లను ఆ మూడు గ్రూపులకు విభజించింది. ఈ నివేదికపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకొని వర్గీకరణను అమలు చేయాలని, కానీ అందుకు విరుద్ధంగా 2011 నాటి లెక్కలను పరిగణించడమేమిటని దళితసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న అనేక ఎస్సీ కులాలు ప్రస్తుతం తెలంగాణలో లేవని ఆయా సంఘాల నేతలు పేర్కొన్నారు. అదీగాక రూ.160 కోట్లు ఖర్చుపెట్టి, శాస్త్రీయ పద్ధతిలో ఇంటింటి సర్వే చేశామని చెప్తున్న ప్రభుత్వం ఆ లెక్కలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. విద్య, ఉపాధి, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయకుండా రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేయడం వల్ల నష్టమే తప్ప మెజార్టీ ఎస్సీ కులాలకు ఒనగూరేది ఏమీ ఉండబోదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అసమానతలు పెంచేలా వర్గీకరణ నివేదిక: 57ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ప్రభుత్వం ఆమోదించిన నివేదిక సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీలలో అత్యంత వెనుకబబడిన కులాలకు కాకుండా మళ్లీ బలమైన వర్గాలకే అధిక శాతం రిజర్వేషన్లు ఇచ్చారంటూ ఒక ప్రకటనలో మండిపడ్డారు. 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే 57ఎంబీఎస్సీ కులాలకు నష్టం వాటిల్లుతుందని తాము మొదటి నుంచి చెప్తున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ సర్కారు పట్టించుకోలేదని వాపోయారు. 2000-2004 వరకు అమలైన వాటినే ఇప్పుడూ కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఉషామెహ్రా కమిషన్ గతంలో మాల, మాదిగ కులాల గ్రూపుల్లో ఉన్న వెనుకబడ్డ దళిత కులాలు తీవ్రంగా నష్టపోయాయని నివేదించినా, అదే విధానాన్ని పాటించి ఆయా ఎంబీఎస్సీ కులాలకు మళ్లీ మాల, మాదిగ ఉప కులాలు అనే ముద్ర వేశారని, వాటి ఉనికి లేకుండా చేయడానికి కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 57 ఎంబీఎస్సీ కులాలకు 6శాతం, మాదిగలకు 5శాతం, మాలలకు4శాతం రిజర్వేషన్లను కల్పిస్తే సరిపోయేదని, లేదంటే 10 శాతంలో మొత్తం 59 కులాల్లో నిరుపేదలను, ఏబీసీలుగా గుర్తించి, మిగిలిన 5 శాతంలో 59 కులాల వారిని ఏబీసీలుగా విభజిస్తే సరిపోయేదని సూచించారు. తమ డిమాండ్లు అటకెక్కించేందుకు కాంగ్రెస్ కుట్రలకు తెరలేపిందని నిప్పులు చెరిగారు. రాజకీయ ప్రయోజనాలు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మిగతా 57 కులాలకు ద్రోహం చేసిందని వెంకటేశం ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్తాం: బీఎంఐ

ఉమ్మడి రాష్ట్రంలో 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో ఎస్సీలను వర్గీకరించడాన్ని బీఎంఐ రాష్ట్ర అధ్యక్షుడు సర్వయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ, వైస్ ప్రెసిడెంట్ మాందాల భాస్కర్ తీవ్రంగా ఖండించారు. ఏకసభ్య కమిషన్ నివేదిక పూర్తిగా తప్పుల తడక అని, తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా ఇంకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లెక్కలు చూపించడం, మాలలను మాత్రమే కాదు తెలంగాణ సమాజాన్ని తప్పు దోవ పట్టించడమేనని మండిపడ్డారు. ఎంపైరికల్ డాటా సేకరించకుండా వర్గీకరణ అమలుకు పూనుకోవడం తీవ్ర అన్యాయమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మంది మాలలకు, మాల ఉపకులాలకు అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 9 శాతం మాదిగలకు, 5 శాతం మాలలకు, 1శాతం ఇతర ఉప కులాలకు రిజర్వేషన్లను అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తామని అన్నారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని, లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై బీఆర్ఎస్ నేతలు వాకౌట్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని వెల్లడించారు.

# కులగణన సర్వే అశాస్త్రీయం

- పదేండ్లలో రెండు లక్షల జనాభా మాత్రమే పెరిగిందనడం విడ్డూరం
- బీసీల జనాభాను తగ్గించి చూపారు
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం జరిపించిన కులగణన సర్వే తప్పులతడకగా, కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉన్నదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2011లో జరిపించిన లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా 3 కోట్ల 50 లక్షల 03 వేల 674 కాగా, 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 3 కోట్ల 68 లక్షల 76 వేల 544, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సర్వేలో 3 కోట్ల 70 లక్షల 77 వేల 544గా నమోదైందని వివరించారు. పదేండ్లలో తెలంగాణ జనాభా కేవలం 2 లక్షలు మాత్రమే పెరిగిందని పేర్కొనడం విడ్డూరంగా ఉన్నదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జరిపించిన సర్వే ప్రకారం బీసీలు (ముస్లిం బీసీలు కాకుండా) 52 శాతం అని నిర్ధారణ కాగా, ఇప్పుడు 46 శాతమేనని ప్రభుత్వం వెల్లడించడం దారుణమని పేర్కొన్నారు. తప్పుల తడక సర్వే నివేదికను మంత్రిమండలి ఆమోదించడం, చట్టసభల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తప్పుడు సమాచారమిచ్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు.

### కులగణన ఆధారంగానే రిజర్వేషన్లు : భట్టి

కులగణన ప్రకారం రాష్ట్రంలో 56.33 శాతం బీసీలు ఉన్నట్టు తేలిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వీటి ఆధారంగానే రిజర్వేషన్లు అమలుచేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బీసీ కులగణనపై శాసనమండలిలో సభ్యులు లేవనెత్తిన సందేహాలపై ఆయన వివరణ ఇస్తూ.. సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు మాత్రమే ఉంటాయని ఆయన చెప్పారు. 2011 జనాభా లెక్కల ఆధారం చేసుకొని రాజకీయంగా రిజర్వేషన్లు అమలుచేస్తామని స్పష్టంచేశారు.

### కులగణన తప్పుల తడక : ఎల్ రమణ



బీసీ కులగణన తప్పుల తడకగా ఉన్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ విమర్శించారు. రాష్ట్రంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 1.40కోట్ల కుటుంబాలు ఉండగా, కులగణన సర్వేలో కేవలం 1.12 కోట్ల కుటుంబాలనే చూపడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీ కులగణనపై శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3.18 కోట్ల మంది ఓటర్లుండగా, బీసీ కులగణన నివేదికలో గణనీయంగా తగ్గించడమేంటని ప్రశ్నించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలు, 2011 జనాభా లెక్కల ఆధారంగా సమగ్ర కులగణన చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

### వర్గీకరణ ఆధారంగానే ఉద్యోగాలు: జీవన్‌రెడ్డి



టీజీపీఎస్సీ ఉద్యోగాల భర్తీని ఎస్సీ వర్గీకరణ ఆధారంగానే చేపట్టాలని కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ఉషా మెహ్రా కమిటీ సిఫారసులను ఆధారంగా చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. శాసన మండలిలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనపై ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన తరువాత డెడికేషన్ కమిషన్ ఏర్పాటుచేయాల్సి ఉన్నదని సూచించారు. రిజర్వేషన్ ఫలాలు ఏ విధంగా కల్పించబోతున్నారో ప్రభుత్వం తెలుపాలని కోరారు.

# శాసనసభ చరిత్రలో చీకటిరోజు

- ఏ వర్గానికీ న్యాయం జరగలేదు
- 'సోషల్ జస్టిస్ డే' ప్రకటన ఎలా?
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): శాసనసభ చరిత్రలో ఫిబ్రవరి 4 చీకటిరోజు అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రంలో దాదాపు 75-80% ప్రజల ప్రధాన అంశాలపై చర్చ పెడుతున్నట్టు ప్రకటించి సభపెట్టిన నిమిషంలోనే వాయిదా వేయడం దారుణమని పేర్కొన్నారు. దీంతో బడుగు బలహీన, దళిత వర్గాల పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధి మరోసారి బహిర్గతమైందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బీసీ, ఎస్సీలను మోసం చేశారని మండిపడ్డారు. కులగణన నివేదికపై మంగళవారం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఈ సభ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి తన అజ్ఞానాన్ని, అవివేకాన్ని, మూర్ఖత్వాన్ని మరోసారి బయటపెట్టుకొని, బీఆర్ఎస్‌పై తన అక్కసును వెళ్లగక్కారని విమర్శించారు. కులగణనలో బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ తన వైఖరి స్పష్టం చేసిందని చెప్పారు. బీసీల జనాభా తక్కువగా చూపారని పార్టీ తరపున ఇప్పటికే చెప్పామని వెల్లడించారు. 3.1% ప్రజల వివరాలు సేకరించకుండానే కులగణన పూర్తయిందని నివేదిక ఇవ్వడం విడ్డూరమని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల బీఆర్ఎస్ మొదటి నుంచి సానుకూలంగా ఉన్నదని గుర్తుచేశారు. రిజర్వేషన్ల విషయంలో ఓ వర్గం ప్రజలు తమకు దక్కాల్సిన వాటా రాలేదని చేస్తున్న పోరాటం న్యాయమైనదని, తెలంగాణ ఉద్యమం నుంచి మద్దతుగా ఉన్నామని తెలిపారు. ఇదే విషయమై కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు గుర్తుచేశారు. ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ సభ ఉన్నదనే ఈ అసెంబ్లీ సమావేశాలు పెట్టారని విమర్శించారు. ఏ వర్గం ప్రజలకు న్యాయం చేశారని 'సోషల్ జస్టిస్ డే' అని ప్రకటించుకున్నారని సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఎంసీఆర్‌హెచ్చార్డీ వెబ్‌సైట్ నుంచి ఎందుకు తొలిగించారని ప్రశ్నించారు.

### కామారెడ్డి డిక్లరేషన్‌ను తుంగలో తొక్కారు: వివేకానంద



కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, బీసీ కులగణన సర్వే తప్పుల తడక అని పేర్కొన్నారు. బీసీలను మోసం చేసిన సీఎం రేవంత్‌ను రాష్ట్రంలో తిరగనియ్యబోమని హెచ్చరించారు. ఆయా వర్గాలను అవమానించి సిగ్గు లేకుండా తెలంగాణ సోషల్ జస్టిస్ డే అని ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ కోసం గాంధీభవన్‌లోనే ఆత్మహత్యలు చేసుకున్నారని, వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టే తీర్పు ఇచ్చిందని ఇందులో కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదన్నారు.

## ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలుచేయాలి

**మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలుచేయాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ సూచించారు. నివేదికల అమలులో జాప్యం జరిగితే ఫలితాలు మరింత ఆలస్యం అవుతాయని పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలిలో మాట్లాడుతూ.. వర్గీకరణ విషయంలో జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని సిఫారసు చేయడాన్ని తప్పుబట్టారు.

## హామీల అమలులో మాటతప్పిన ప్రభుత్వం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాల్సిందే
- శాసనమండలిలో బీఆర్ఎస్ విప్ సత్యవతి రాథోడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 80 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా ఆశలపై నీళ్లు చల్లి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని శాసనమండలిలో బీఆర్ఎస్ విప్ సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణ నివేదికపై సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపు అంశాలపై కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు తీర్మానం చేసినట్టు గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి 6 నెలలు అవుతున్నా.. అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు పెరుగాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గీకరణకు బీఆర్ఎస్ మద్దతివ్వడమే కాకుండా, అమలుచేసిందని గుర్తుచేశారు. కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణను ఎలా అమలుచేస్తారో చెప్పాలన్నారు.

# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బీసీ జనాభా తగ్గుదలకు కారణమేంటి?
- హిందూ బీసీ, ముస్లిం బీసీ పదాల వల్ల ఎవరైనా కోర్టు కెళ్తే ఈ సర్వే నిలబడదు
- అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే శంకర్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): బీసీ కులగణనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్తున్న దానికి, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న దానికి పొంతనలేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండిపడ్డారు. బీసీ కులగణన విషయంలో సర్కారు తీరుచూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్టుగా కనిపిస్తున్నదని విమర్శించారు. కులగణన సర్వే లో 98 లక్షల జనాభాను తగ్గించారని మండిపడ్డారు. కులగణన సర్వేపై మంగళవారం అసెంబ్లీలో నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వెబ్‌సైట్ ప్రకారం రాష్ట్ర జనాభా 4.33కోట్లు ఉన్నట్టు తెలుస్తున్నదని, సర్వే ప్రకారం 3.54 కోట్లుగా ప్రకటించారని ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలతో పోల్చుకుంటే, ప్రస్తుత లెక్కల్లో బీసీల జనాభా గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. బీసీలు కాపురాలు చేయడంలేదా? పిల్లలు పుట్టడంలేదా? బీసీలేమైనా కనుమరుగవుతున్న జాతులా? ఏ కారణం వల్ల తగ్గిందో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ముస్లిం బీసీలేమిటో.. ఎక్కడినుంచి తెచ్చారో?

కులగణన సర్వేలో ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని కొత్త పదాలు సృష్టించారని ఇదేమిటని పాయల్ శంకర్ ప్రశ్నించారు. ముస్లిం బీసీ పదంపై సాధారణ వ్యక్తి కోర్టుకెళ్లినా ఈ సర్వే నిలబడదని పేర్కొన్నారు. ఈ పదం పెట్టడం ద్వారా, కోర్టుకు వెళ్లే అవకాశం ప్రభుత్వం కల్పించినట్టు అవుతుందని అన్నారు.

## సర్వేలో తప్పుడు లెక్కలు : అక్బరుద్దీన్ ఓవైసీ



హైదరాబాద్, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం కులగణన సర్వేలో తప్పుడు లెక్కలు చూపిందని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్‌ఓవైసీ ఆక్షేపించారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా సర్వే చేశామని చెప్పిన ప్రభుత్వం.. పూర్తినివేదికను సభలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీ చర్చలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కులగణన సర్వేకు చట్టబద్ధత కల్పించి చర్చ పెడుతుందని భావించినట్టు తెలిపారు. రాష్ట్రంలో 3.35 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ఎలక్షన్ కమిషన్ చెబుతుంటే సర్వేలో మాత్రం మొత్తం జనాభాను 3.54 కోట్లని చూపడం నమ్మశక్యంగా లేదన్నారు. ఇప్పుడు ముస్లింలతో కలిపి బీసీల సంఖ్య 56.33 శాతం ఉన్నదని చూపడం సరికాదని అన్నారు.

### చట్టబద్ధత కల్పించాలి: అల్లుగుబెల్లి

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తక్షణమే అమల్లోకి తేవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. కులగణనలోని సందేహాలను నివృత్తికి సర్వేను రీ వెరిఫికేషన్ చేయాలని కోరారు.

### బీసీలకు కాంగ్రెస్ నమ్మక ద్రోహం : కిశోర్‌గౌడ్

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటా ఇవ్వకుండా సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్ నేత, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్ ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు తూట్లు పొడుస్తూ బీసీ రిజర్వేషన్లను ఎగ్గొట్టిందని మండిపడ్డారు.